

## మళ్లీ చెప్పిన కథలు

—రావి కొండలరావు

# లంచగొండి - యమలోకం

పేరూ ఊరూ తెలియని ఒకానొక ఊరు. ఆ ఊళ్లో ఒక పెద్ద మనిషి. అంతకుముందున్న అతని పేరేమిటోగానీ, సిరిగలవాడయ్యాడు గనక లచ్చయ్య అని పెట్టుకొన్నాడు. లచ్చయ్య రాజోద్యోగి. పన్నుల వసూళ్ళ శాఖలో ఉన్నతోద్యోగి. నాగలి పట్టకుండానే సిరిపంట పండించగల నిత్య కృషీవలుడు! అతనింట్లో వున్న అతని మంచం, కంచం కూడా 'లంచం' బాపతువే అని, పక్కింటివాళ్ళు ఇరుగు పొరుగులతో చెప్పుకుంటూ వుంటారు. అలా చెప్పుకోవడంతో అతని పేరుని తిరకాసు చేసి, "లంచయ్య" అని కూడా చెప్పుకుంటూ వుంటారు. లచ్చయ్య ఓ ప్రక్క సిరిమంతుడయినా, ఇంకోపక్క మాత్రం పట్టి పిసినారిమంతుడు. తెల్ల పిల్లికి బిచ్చం పెట్టడు; నల్ల కాకికి ఎంగిలి చెయ్యి విదిలించడు. పైగా లంచం స్వీకరించకుండా అతను ఏ పనీ ముట్టుకోనని, ఏ పని చెయ్యాలన్నా చెయ్యి తడపవలసిందేనని - బహిరంగంగా అతనే చెప్పుకుంటాడు. అలా 'చెయ్యి' పట్టీ, ఇలా చెయ్యి బట్టీ అతను భాగ్యవంతుడు, దరిమిలా శ్రీమంతుడూ అయి కూచున్నాడు. ఐతే లచ్చయ్యమీద, అతని సంపాదన మీదా కొన్ని ఫిర్యాదులు వెళ్ళినా ఆస్థానంలోని మహోన్నతోద్యోగులు ఏమీ పట్టించుకోలేదు. లచ్చయ్య వాళ్ల గుప్పిట్లోనూ, వాళ్ళు లచ్చయ్య గుప్పిట్లోనూ 'గప్ చిప్'గా వుంటారు గనక గొడవేలేదు. ఆ విషయం రాజుగారి వరకూ వెళ్తే ఆయన విశ్రాంతి పొందిన ఆస్థాన న్యాయమూర్తులతో దర్యాప్తు సంఘం ఏర్పాటుచేసి, లచ్చయ్య మీద విచారణ జరిపించేవారేమోగాని, ఆయనకేమీ తెలియకపోవడంతో లచ్చయ్య, లచ్చయ్య లాంటివాళ్ళు రాజావారి దృష్టిలో నిజాయితీపరులుగా, నిశ్చింతగా బతి కేస్తున్నారు. అంచేత ఏ అడ్డూఆపూ లేకుండా తన భార్యలకి ఏడు వారాల నగలు చేయించాడు. పిల్లలకి బంగారం మొలతాళ్ళు, బంగారం చెప్పులూ చేయించాడు. స్నానాల గదిలో బంగారు కొళాయిలు పెట్టించాడు. బంగారు గంగాళాలు చేయించాడు. ఇంకా కొంత బంగారాన్ని ధనరాశిని తన రాజ్యంలో వుంటే క్షేమం కాదని, దూరంగా వున్న ఇంకో రాజ్యంలో గుప్తం చేయించాడు.

అంతటి బంగారు చిలక్కి ఆయువు మూడింది. ఒకరోజు తన గుర్రం మీద పొరుగూరు వెళ్ళి వస్తూ దార్లో ప్రమాదవశాత్తు బండమీద పడిపోయి దిక్కుమాలిన చావు చచ్చాడు. "పాపం! ఇంత బంగారం ఇంత డబ్బు అతన్ని కాపాడలేకపోయిందే" అని కొందరూ, అంత సంపాయించి కూడా ఓ చిన్నం బంగారమ్ముక్కయినా కూడా తీసుకెళ్ళలేకపోయాడు కదా పాపం" అని కొందరూ 'లంచయ్య'మీద జాలి పడ్డారు.

లచ్చయ్య బండమీద పడ్డం ఏమిటి- భయంకరాకారులైన ఇద్దరు యమ కింకరులు అతనిమీద పడ్డారు. "పదండి లంచగొండి లచ్చయ్యగారూ, నరకానికి విజయం చేయండి. అక్రమంగా అవినీతిగా ప్రజల్ని పిండి, డబ్బు దోచిన వారిని మేము సాదరంగా మా లోకానికి ఆహ్వానిస్తాము. యాత్రా రుసుము లేదు. ఉచిత వాయుయాత్ర. సర్వ ఖర్చులూ మావే. దయచేయండి." అని వాళ్ళకేసి అతన్ని లాక్కుపోయారు.

లచ్చయ్యకేమీ అర్థం కాకపోయినా, యమలోకం చేరిన తర్వాత అంతా అర్థమైంది. అక్కడ యమ ధర్మరాజు కూడా తనలాగే సంపాయించిన బంగారం ఏం చేసుకోవాలో తెలీక పెద్ద కిరీటం చేయించుకున్నాడు. సింహాసనం చేయించుకున్నాడు. వాటికి మణులు మాణిక్యాలూ పొదిగాడు. యమ ధర్మరాజుని తనతో పోల్చుకుని లచ్చయ్య తృప్తి పడి సంతోషించాడు.

లచ్చయ్య కుంచాలతో లంచాలు కొట్టి అవినీతిగా ధన సంపాదన చేశాడని, ఏనాడూ పిల్లికి బిచ్చం పెట్టలేదని, అమిత స్వార్థపరుడని, అతని గురించి న్యాయమూర్తికి వివరించారు. నేరం అంతా విన్న యమధర్మరాజు "రెండు నల్లగా చూశారు. "ఏమిస్తారో చెప్పండి. తల వంచుతాను." అన్నాడు లచ్చయ్య

కత్తులతో మెడ మీద ఒకసారి కొట్టి, తల నరికి, ఆ తలని ఇనప డేగలకి! మొండాన్ని ఇనప కాకులకి ఆహారంగా వెయ్యండి" అని శిక్ష వేసి పంపాడు. లచ్చయ్య యమ ధర్మరాజుని చూసి, సింహాసనం చూపిస్తూ "మరి మీరు మాత్రం......" అని ఏదో అనబోయాడుగాని, అతన్ని భద్రంగా తోడి తెచ్చిన కింకరులు బరబరా లాక్కుపోయారు. కొంత దూరం లాక్కెళ్ళి, నిలబెట్టి "మెడ వంచవయ్యా లంచగొండయ్యా - వేటు వేస్తాం" అన్నారు కర్కశంగా. లచ్చయ్య అదోలా చూశాడు. తన చేతికి తడి అంటందే ఏ పనికీ ఒప్పుకునే అలవాటు లేదతనికి. వీళ్ళు ఊరికే తల వంచమంటే వంచేస్తానా అనుకొని, "నాకేమిటి లాభం-మెడవంచితే" అన్నాడు . కింకరులు అర్థంకాని కళ్లతో

బొటన వేలుతో చూపుడు వేలుని మీటు మీటుతూ. కింకరులు అతన్ని అర్థం చేసుకోలేక "కింకర్తవ్యం" అన్నట్టు చూశారు.

"అర్థం కాలేదా నా తండ్రులారా! నాకేదైనా ముట్టచెప్పాలి. ఇంతా అని ఇవ్వండి. లేకపోతే మీ పని జరగదు" అన్నాడు లచ్చయ్య నవ్వుతూ. కింకరుల కింకా అర్థం కాలేదని 'లంచం' అని చెప్పి తన హృదయం విప్పాడు. "ఆహా! వీడు పరమ లంచగొండి. లంచాలు పుచ్చుకున్న నేరానికి నరకానికి తెస్తే ఇక్కడ కూడా లంచం అడగ్గలిగిన మహా ఘన మానవుడు! వీణ్ణి ఏం చేసినా పాపం లేదు. పైగా మనకి బోలెడు పుణ్యం వస్తుంది-ఈ నరకం విడిచి మనం స్వర్గం పోవచ్చు" అను కొన్నారు కింకరులు. అనుకోడం ఏమిటి-వీడికి గట్టి శిక్ష వేయించాలని రాజుగారితో ఆ విషయం విన్నవించారు. ధర్మరాజులవారికి కళ్ళు మరింత ఎర్రబడ్డాయి. "వీడు పరమనీచుడు. సకల హింసలూ పెడుతూ, కొంత కాలం పోయిన తర్వాత తీసుకురండి" అన్నాడు క్రోధావేశపూరితుడై.

లచ్చయ్య దీర్ఘం కాలంపాటు పలు శిక్షలు అనుభవించాక, మళ్లీ తీసుకొచ్చారు కింకరులు యమధర్మరాజు దగ్గరికి. "వీడింకా లంచం మాట వదిలిపెట్టడం లేదు ప్రభూ! శిక్ష అనగానే లంచం అంటున్నాడు". అని ఫిర్యాదు చేశారు.

"ఐతే ఇలాంటి నీచుడికి ఇక్కడ కూడా స్థానం లేదు. తిన్నగా తీసుకెళ్ళి ఆ భూలోకంలోనే వదిలెయ్యండి. అక్కడ అన్నం నీరు లేని గ్రామాలెన్నో వున్నాయి. కుళ్ళు రాజకీయాలతో మగ్గి పోతున్న అలాంటి గ్రామంలో పారేయండి. అదే తగిన శిక్ష!" అన్నాడు యమధర్మరాజు. తిరిగి భూలోకం వెళ్తున్నందుకు లచ్చయ్యకి ఎంతో సంతోషం కలిగింది. తను మళ్ళీ అక్కడ రాజ్యం ఏలవచ్చు. పైగా ఇప్పుడు అక్కడ తనబోటి వాళ్లకి చాలా అవకాశాలు వున్నట్టు కూడా విన్నాడు. అంచేత ఓ కోరిక కోరదామనిపించి, "ప్రభూ! నాదొక చిన్న కోరిక. ఎలాగూ మీముందు నేను ప్రత్యక్షం అయ్యాను గనుక, మీరు కోరిన కోరికకు సరే అన్నాను గనక, నా కోరిక తీర్చగోరు తున్నాను" అన్నాడు లచ్చయ్య.

"కోరుకో"

"ఎలాగూ నన్ను మా దేశం పొమ్మంటున్నారు గనక, ఏ రాష్ట్రంలో నయినా సరే నన్ను ఎమ్మెల్యేగా గానీ, మంత్రిగా గానీ చెయ్యండి. లేదా ప్రభుత్వ పాలనలో రెవిన్యూ, పబ్లిక్ వర్క్సు, లైసెన్సింగ్ అథారిటీ, టౌన్ ప్లానింగ్, రైలు టిక్కెట్ల తనిఖీ, టెలిఫోన్ల జారీ, నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి, జనరల్ ఆస్పత్రి, దూరదర్శన్ లాంటి శాఖలు ఎన్నో వున్నాయని ఇక్కడికొచ్చిన మిత్రులు చెప్పారు. ఆయా శాఖల్లో లేదా మునిసిపాలిటీ- కార్పొరేషన్‌లలోగాని, నాకో మంచి ఉద్యోగం దొరికేలాగా తమరు వరం ఇస్తే నా వృత్తిని నేను కొనసాగించగల గడానికి నాకు చక్కని అవకాశం వుంటుంది. లచ్చయ్య, లంచయ్య అనే నా రెండు పేర్లూ సార్థకం చేసుకుని ఇప్పుడు మరీ స్థిరపడిపోతాను" అని విన్నవించాడు లచ్చయ్య అతి వినయంగా- ఆ యమధర్మరాజు, అతని పరివారమూ దిమ్మతిరిగి, విస్తుపోయి, మూర్ఛపోయేలా. ●